క్లుప్తంగా

హెల్మెట్ శిరస్సుకు రక్షణ కవచం


మాట్లాడుతున్న ఎస్సై శ్రీరాం

కనిగిరి రూరల్: వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రాణ రక్షణ పొందాలని ఎస్సై టి.శ్రీరాం అన్నారు. మండలంలోని ఉస్తుంవారిపల్లి, అడ్డురోడ్డు గ్రామాల్లో హెల్మెట్ వినియోగం, రోడ్డు భద్రత, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై టి.శ్రీరాం మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రాణాప్రాయం నుంచి బయటపడతారన్నారు. హెల్మెట్ శిరస్సుకు రక్షణ కవచంలా ఉపయోగ పడుతుందని వివరించారు. హెల్మెట్ వినియోగం వల్ల కలిగే లాభాలను, ఉపయోగాలను వివరించారు. వాహనచోదకులు విధిగా రోడ్డు భద్రతా ప్రమాణాలను, ట్రాఫిక్ నిబంధనలను పాటించాలన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించి, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.

దశలవారీగా వార్డుల్లో అభివృద్ధి పనులు


కచ్చా డ్రైన్‌లను తీయిస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరి రూరల్: పట్టణంలోని అన్ని వార్డుల్లో దశలవారీగా అభివృద్ధి పనులు చేపడతామని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక కాశిరెడ్డి కాలనీలో ఆదివారం సమస్య పరిష్కారం కార్యక్రమం భాగంగా పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు రోడ్లు, డ్రైనేజీ కాలువలు, వీధి లైట్లు, నీటి సమస్యలను విన్నవించారు. దీంతో చైర్మన్ గఫార్ తక్షణ చర్యగా మురికి నీరు పోయేందుకు కచ్చా డ్రైన్లను తీయించారు. కొత్తగా నీటి పైప్ లైన్ ఏర్పాటు చేసి నీటి సౌకర్యం కలిప్తానని తెలిపారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

టంగుటూరు: మండలంలోని సూరారెడ్డిపాలెం గ్రామ శివారులోని డంపింగ్ యార్డులో పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి ఏడుగురు జూదరులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.6,240 నగదు, సెల్‌ఫోన్లు, ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు ఎస్సై నాగమల్లేశ్వరరావు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తామన్నారు.

నారాయణస్వామి ఆలయంలో పూజలు


నారాయణస్వామి వారి పూజల్లో నేతలు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణ స్వామి ఆలయంలో ఆదివారం వైఎస్సార్ సీపీ మైనారిటీసెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్.బుజ్జి, సర్పంచ్ షేక్.ఖాదర్‌బీలు దర్శించుకుని పూజలు నిర్వహించారు. అర్చకులు స్వామి శేషవస్త్రంతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు వసతులపై చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ, వెంకట్రావులతో చర్చించారు. ఆయన వెంట కే.అక్కయ్యయాదవ్, షేక్.అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

ఇనగలేరుపై బ్రిడ్జి నిర్మించాలి

టంగుటూరు: ఇనగలేరుపై ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని సీపీఎం జిల్లా నాయకుడు రాము డిమాండ్ చేశారు. పొందూరు గ్రామ సీపీఎం శాఖ 15వ మహాసభలు వేజండ్ల హనుమంతురావు అధ్యక్షతన ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న పరిటాల కోటయ్య స్థూపం వద్ద సీపీఎం జెండాను ఎగరవేశారు. పొందూరు, కొణిజేడు గ్రామాల మధ్యలో ఉన్న ఇనగలేరు మీద ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే పొందూరు, నిడమానూరు గ్రామాల మధ్య ఉన్న మంగళి వాగుపై కూడా బ్రిడ్జి నిర్మించాలని సీపీఎం నాయకులు కోరారు. పొందూరు గ్రామ శాఖ సీపీఎం కార్యదర్శిగా వేజండ్ల సింగయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో టంగుటూరు మండల కన్వీనర్ మోజేసు, వేజండ్ల వెంకటరత్నం, ముప్పరాజు రమేష్, పాపినేని వెంకటేశ్వర్లు, వేజండ్ల సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

గుడ్లూరు (కందుకూరు రూరల్): అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను మండలంలోని నరసాపురం వద్ద పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ట్రాక్టర్ యాజమానులపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవన్నారు.

ఉద్యానమే ఉపాధి

- ఉద్యాన పంటల సాగుతో మెరుగైన లాభాలు
- సన్నా చిన్న కారు రైతులకు ఉపాధి హామీలో సబ్సిడీ
- పెద్ద రైతులకు ఉద్యానశాఖ ద్వారా రాయితీలు
- హైబ్రిడీ కూరగాయల సాగు కూడా మేలే..


సాగులో ఉన్న మామిడి తోట

కందుకూరు రూరల్: ఉద్యాన పంటలు ప్రస్తుతం రైతులకు ఉపాధి మార్గంగా మారింది. అందుకే ఈ పంటలు ప్రోత్సహించేందుకు ప్రభుత్వ రాయితీలు అందజేస్తోంది. పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వ వివిధ రకాలగా రాయితీలను ఇచ్చి రైతులకు ఆసరాగా నిలిస్తోంది. ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా సన్నా, చిన్న కారు (ఐదు ఎకరాల) లోపు రైతులకు వందశాతం రాయితీ లభిస్తుంది. పంట మార్పిడితో పాటు హైబ్రీడ్ కూరగాయల సాగు కూడా చేసుకోవడం ఉత్తమం. ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా మామిడి, జామ, తైవాన్ జామ, సపోట, కొబ్బరి, నేరేడు, సీతాఫలం, అవకాడో, ఆపిల్ బేర్, నిమ్మ, డ్రాగన్ ఫ్రూట్, మునగ పంటల సాగు చేసుకోవడానికి రైతులు సిద్ధం కావాలి. ప్రభుత్వం పంటలకు వందశాతం రాయితీను అందిస్తోంది. అయితే ఈ పథకం కేవలం గ్రామీణ ప్రాంత రైతులకు మాత్రమే వర్తిస్తుంది. ఐదు ఎకరాల్లోపు ఉన్న రైతులు పంట సాగు చేసుకోవాలనుకుంటే ఉపాధి హామీ జాబ్ కార్డు కలిగి ఉండాలి. ఇచ్చిన పండ్ల తోటలు సాగు చేయాలనుకుంటే నర్సరీలో రైతు ముందుగా మొక్కలు కొనుగోలు చేసుకుంటే రవాణా చార్జీలతో సహా నగదును రైతు ఖాతాల్లో వేస్తారు. అదే విధంగా వారి పొలంలోనే పనులు చేసుకుంటే కూలీ ఉపాధి హామీ ద్వారా చెల్లిస్తారు. ఇలా తోట సాగుకు మూడు సంవత్సరాల పాటు నగదు చేయూత ఉంటుంది. మూడు సంవత్సరాల పాటు పూర్తిగా ఉపాధి హామీ పథకం కిందనే సాగు చేస్తారు. ఒక ఎకరా ఉన్నా కూలీ అందిస్తారు. అందుకే ఈ పథకం సన్నా చిన్న కారు రైతులు ఉపయుక్తంగా ఉంటుంది. ఉద్యానవనశాఖాధికారులు పర్యవేక్షణలో పంటలు సాగు చేసుకోవచ్చు.

చేయూత ఇలా..

ఒక ఎకరా సాగు చేస్తే మామిడికి రూ.1,09,950, బత్తాయి పంటకు రూ.1,37,750, నిమ్మకు రూ.1,46,311, జామ పంటకు రూ.1,46,971, తైవాన్ జామకు రూ. 2,51,224, సపోటాకు రూ.95,584, కొబ్బరి తోటకు రూ.99,183, నేరేడుకు రూ.68,163, సీతాఫలంకు రూ.2,164,417, డ్రాగన్ ఫ్రూట్‌కు రూ.2,00,714, దానిమ్మ పంటకు రూ.2,16,417, మునగకు రూ.27,515 వంతున ప్రభుత్వం అందించనుంది. ఈ మొత్తం మూడు సంవత్సరాలపాటు మొక్కలు, రవాణ, కూలీలు, సేద్యం రూపాల్లో విడతల వారీగా నగతును రైతు ఖాతాలో జమ చేస్తారు. అదే విధంగా ఉద్యానవనశాఖ ద్వారా ఐదు ఎకరాలు పైన ఉన్న రైతులకు రాయితీలు వర్తిస్తుంది. ఈ శాఖ ద్వారా ముందుగా రైతులు పెట్టుబడి పెడితే తర్వాత రాయితీని రైతుల ఖాతాలో జమ చేస్తారు. హెక్టార్‌కు అయితే వేలల్లోనే రాయితీ ఉంటుంది. హైబ్రీడ్ కూరగాయల సాగుకు హెక్టార్‌కు రూ.20వేలు రాయితీ లభిస్తుంది. అదే విధంగా కమ్యూనిటీ ఫారం పాండ్‌కు రూ.20 లక్షలు, వ్యక్తిగత ఫారం పాండ్‌కు రూ. 75000లు ఇస్తారు.

ఉపాధి కార్యాలయంలో సంప్రదించాలి

ఆసక్తి ఉన్న సన్నా, చిన్న కారు రైతులు ఉపాధి హామీ పథకంలో వందశాతంపై ఇచ్చే పండ్ల తోటలను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ సుజాత తెలిపారు. తోటలు సాగు చేయాలనుకునే రైతులు ఉపాధి కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.


పామూరు:అన్నపూర్ణా అలంకారంలో వాసవీమాత ఉత్సవమూర్తి


లలితా త్రిపుర సుందరి దేవిగా దేవిగా వల్లూరమ్మ


జమ్ములపాలెంలో లక్ష్మీదేవిగా అమ్మవారు


నాగిరెడ్డిపాలెంలో లలితా త్రిపుర సుందరీ దేవి అవతారంలో అమ్మవారు

దుర్గమ్మ తల్లీ పాహిమాం..రక్షమాం..


అన్నపూర్ణాదేవి అలంకరణలో దర్శనమిస్తున్న అమ్మవారు


భక్తులకు మహాలక్ష్మి రూపంలో దర్శనమిస్తున్న అమ్మవారు


కందుకూరు: లలిత త్రిపుర సుందరి దేవి అలంకారంలో దుర్గమ్మ


కందుకూరు: అన్నపూర్ణాదేవి అలంకారంలో శ్రీవాసవిమాత

టంగుటూరు: దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా ఆదివారం వల్లూరమ్మల తల్లి లలిత త్రిపుర సుందరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి రుద్రాభిషేకాలు, పంచామృత అభిషేకాలు ప్రత్యేకంగా నిర్వహించారు. రాత్రి ఉత్సవారికి ఉత్సవం వైభవంగా సాగిందని ఈఓ రమేష్ తెలిపారు. అలాగే జమ్ములపాలెంలోని అన్నపూర్ణ సమేత కాశీవిశేశ్వర ఆలయంలో అమ్మవారు లక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

పొన్నలూరు: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని పలు దేవాలయాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. మండలంలోని నాగిరెడ్డిపాలెం పోలేరమ్మతల్లి అమ్మవారు ఆదివారం లలితా త్రిపుర సుందరీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని అందంగా అలంకరించి, విశేష పూజలు నిర్వహించారు. గ్రామంలోని మహిళలు, భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

మర్రిపూడి: మండలంలోని కూచిపూడి, మర్రిపూడి శివాలయాలల్లో అమ్మవారు ఆదివారం మహాలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చింది. అమ్మా మహాలక్ష్మి కరుణించమ్మా అంటూ భక్తులు అమ్మవారిని వేడుకున్నారు. మర్రిపూడిలోని శివాలయ అర్చకులు నుదురుపాటి అంబయ్య పంతులు, గూడలి కృష్ణచైతన్యశర్మ శివపార్వతులకు పూల మాలలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి నూతన వస్త్రాలతో అలంకరించి, కుంకుమార్చన. సహస్రనామపూజ, అష్టోత్తర పూజలు చేశారు. గంద్రకోట సుబ్రమణ్యం శాస్త్రి దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు.

కనిగిరి రూరల్: దసరా బ్రహ్మోత్సవాల వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. పట్టణంతో పాటు మండలంలోని వివిధ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయాల్లో కొలువుదీరిన అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. కనకదుర్గమ్మ గుడి, అంకాళమ్మ గుడి, మద్విరాట్ వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయం, దొంతులమ్మ గుడి, సాయిబాబా గుడిలో, దేవాంగనగర్‌లోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయాల్లో ఆయా కమిటీల ఆధ్వర్యంలో శరన్నవ రాత్రి ఉత్సవాల సందర్భంగా విశిష్ట పూజలు చేశారు. స్థానిక గార్లపేట రోడ్డులోని శ్రీ దేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామికి అభిషేకాలు, కళ్యాణోత్సవాలు జరిగాయి. నందన మార్లెల్లో ఉన్న బాలకోటేశ్వర స్వామి దేవస్థానంలో చండీ హోం, రుద్రాభిషేకాలు, విశిష్ట పూజలు చేశారు.

పామూరు: దసరా శరన్నవరాత్రులలో భాగంగా 4వ రోజు పామూరులో వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో ఆదివారం అమ్మవారు అన్నపూర్ణాదేవిగా, అమ్మవారి మూల విగ్రహమూర్తి స్వర్ణాలంకృత అలంకారములో దర్శనమిచ్చారు. ఈసందర్భంగా ఆలయంలో అర్చకులు తులసీనాథ్, సుమంత్‌శర్మ వేదమంత్రాల నడుమ వాసవీమాత మూలవిగ్రహమూర్తికి, ఉత్సవమూర్తికి విశేష పూజలు చేశారు. దేవస్థాన కమిటీ యేల్చూరి బాలకొండలు, సేగు క్రిష్ణయ్య, దరిశి మస్తాన్‌రావు ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

వీసీపల్లి: మండల పరిధిలోని పెద యిర్లపాడు శివలింగాల శైవక్షేత్రంలో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. అమ్మవారికి అన్నపూర్ణాభిషేకం, దేవి ఖడ్గమాల, లలిత సహస్రనామ పూజ, కుంకుమార్చన పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

కనిగిరి రూరల్: దసరా బ్రహ్మోత్సవాలు పురస్కరించుకుని పట్టణంలోని పలు ఆలయాల్లో మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో జరిగిన విశిష్ట పూజలు, అభిషేకాలు, కళ్యాణోత్సవాల్లో చైర్మన్ గఫార్ పాల్గొని పూజలు చేశారు. తొలుత ఆలయ కమిటీ నాయకులు చైర్మన్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ డైరక్టర్ బొట్టు శ్రీను, పసుపులేటి అరుణోధర్, ఆలయ కమిటీ నాయకులు నార్లపాటి సాంబ,చెన్నా సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

అంకమ్మతల్లికి అభిషేకం

కందుకూరు: కందుకూరు గ్రామ దేవత శ్రీఅంకమ్మ తల్లి ఆలయంలో విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని దేవి నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా నాలుగో రోజు ఆదివారం అంకమ్మ తల్లి అమ్మవారికి ఉదయం ఆలయ అర్చకులు వేదమంత్రాలతో వైభవంగా అభిషేకం నిర్వహించారు. అమ్మవారిని కన్నుల పండువగా అలంకరించి అమ్మవారి అష్టోత్తరరం కుంకుమ పూజ నిర్వహించారు. ఉదయం దాతలు దొంతి నరేంద్ర, శివపార్వతి, జిడ్డు జయకృష్ణ, శ్రీలత, చీదేళ్ల కృష్ణ, పద్మలీల, నాగినేని కోటేశ్వరరావు, రేవతి, దారం మాల్యాద్రి గంగమ్మ, అనుమాలశెట్టి శ్రీకాంత్, సుధారాణి దంపతులు అమ్మవారి సేవలో పాల్గొన్నారు. సాయంత్రం వైభవంగా పల్లకీ సేవ నిర్వహించారు. అమ్మవారి పల్లకి సేవ ముందు మంగళ వాయిద్యాలు సరస్వతి నిలయం నటరాజ నాట్యమండలి వారిచే కోటాలం నిర్వహించారు.

కందుకూరు రూరల్: దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకొని కందుకూరులో నాలుగో రోజు ఆదివారం దేవీశరన్నవరాత్రులను కన్నుల పండువగా జరుపుకున్నారు. పెద్ద బజారులోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో భక్తులకు అన్నపూర్ణాదేవి అలంకారంలో దర్శనిమిచ్చారు. ఆలయ అర్చకులు అమ్మవారని అన్నపూర్ణదేవి రూపంలో అలంకరించారు. అమ్మవారికి ఉదయం అభిషేకం, అష్టోత్తరం, అమ్మవారి మూలమంత్ర హోమం నిర్వహించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని లలితా సహస్రనామ పారాయణం పఠించారు. అనంతరం విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.


వెంకటేశ్వర స్వామి గుడిలో పూజలు చేస్తున్న చైర్మన్ గఫార్


వెంకటేశ్వర స్వామి ఆలయంలో కళ్యాణోత్సవం


నందనమారెళ్లలోని గుడిలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు


అంకమ్మతల్లి దేవాలయంలో అభిషేక కార్యక్రమంలో భక్తులు

నూతన వధూవరులకు దద్దాల ఆశీర్వాదం


వధూవరులకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఇన్‌చార్జ్ డాక్టర్ దద్దాల

సీఎస్‌పురం(పామూరు): మండలంలో జరిగిన పలు వివాహ వేడుకలకు ఆదివారం వైఎస్సార్ సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దద్దాల నారాయణయాదవ్ హాజరయ్యారు. అరివేములలో జరిగిన వైఎస్సార్ సీపీ నాయకుడు సంగటి భాస్కర్ వివాహ వేడుకల్లో పాల్గొని నూతన దంపతులు సంగటి భాస్కర్ మేరి దంపతులను ఆశీర్వదించారు. ముందుగా మండల నాయకులతో సమావేశమయ్యారు. ఆయన వెంకట పార్టీ మండల అధ్యక్షుడు భువనగిరి వెంకటయ్య, సర్పంచ్ సన్నపురెడ్డి రాధారుక్మిణమ్మ, ఎస్.ప్రకాష్‌రెడ్డి, కె.నారాయణ, అన్నెబోయిన గురురాజా, బక్కా దేవదానం, దేవరాజు, భాగ్యరాజు, ఈశ్వరయ్య, నాగిరెడ్డిపల్లె సర్పంచ్ స్వర్ణ ఏడుకొండలు, హెచ్‌ఎంపాడు మండల నాయకులు ఆదినారాయణరెడ్డి, వాకమళ్ల రాజశేఖర్, సోషల్‌మీడియా నియోజకవర్గ అధ్యక్షుడు మర్రి రాజుయాదవ్, నాయకులు పాల్గొన్నారు.

కులగణనతో రిజర్వేషన్లు అమలు చేయండి


మాట్లాడుతున్న సాగర్


రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరైన నాయకులు

కందుకూరు రూరల్: దేశవ్యాప్తంగా కుల గణన చేసి తర్వాతనే రిజర్వేషన్లను అమలు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సీఎస్ సాగర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహాత్మా జ్యోతిబా పూలే స్థాపించిన సత్యశోధక్ సమాజ్ 152వ ఆవిర్భావ దినం సందర్భంగా ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ), భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో ఆదివారం కందుకూరులోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 74 సంవత్సరాలు అయినప్పటికీ ఇంకా ప్రజల మధ్య ఆర్థికంగా, సామాజికంగా అనేక వ్యత్యాసాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు పేదలు ఒక వైపు ఉంటే అగ్రకుల సంపన్న పెట్టుబడిదారులు మరొకవైపు ఉన్నారన్నారు. వీరి మధ్య ఉండే సామాజిక అంతరాలను బహిర్గతం చేయాలంటే కులగణన తప్పక చేయాలని డిమాండ్ చేశారు. 2023 అక్టోబర్‌లో బీహార్ రాష్ట్రంలో జరిగిన కుల గణన అనేక సామాజిక అంశాలను ఎత్తి చూపిందన్నారు. కులగణన జరిపి దీని ప్రకారం రిజర్వేషన్ అమలు చేస్తే దేశంలో ఉండే కులాల మధ్య అంతరాలు పోతాయనే ఆందోళనతోనే ఆర్‌ఎస్‌ఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే కులగణన చేసి రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో సీపీఐ నాయకులు మాల కొండయ్య, సురేష్, సీపీఎం నాయకులు గౌస్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.మోహన్, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు కె.నాంచార్లు, ఏపీటీఎఫ్ నాయకులు హరిబాబు, విశ్రాంత బ్యాంక్ మేనేజర్ పి.కోటేశ్వరరావు, సుధీర్, జనార్దన్, నాగయ్య, తదితరలు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా!


నిరుపయోగంగా ఉన్న బస్‌స్టాండ్

వలేటివారిపాలెం: మండల కేంద్రమైన వలేటివారిపాలెంలోని బస్‌స్టాండ్ నిరుపయోగంగా మారింది. పామూరు బస్‌లు బస్టాండ్‌లో ఆగడం లేదు. దీంతో పాటు ప్రస్తుతం బైపాస్ నిర్మాణం జరగడంతో కడప నుంచి విజయవాడ, పులివెందుల నుంచి విజయవాడ, ఉదయగిరి నుంచి విశాఖపట్నం వెళ్లే బస్సులు గ్రామంలోకి రాకుండా బైపాస్‌లో నుంచే వెళ్తున్నాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఊర్లో బస్ స్టాండ్ ఉన్నా అధికారులు పట్టించుకోకపోవంతో స్టాండ్ దగ్గర బస్ నిలవడం లేదని ప్రయాణికులు చెప్తున్నారు. ప్రతి శనివారం మాలకొండలోని శ్రీమాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవాలయం ఎక్కువగా భక్తులు వస్తుంటారు. బస్‌లు కూడా నిత్యం తిరుగుతుంటాయి. అయితే బస్‌స్టాండ్‌కు వెళ్లకపోవడంతో ఆ భవనం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా.. మందుబాబులకు అడ్డాగా మారింది. బోర్‌వెల్ వాహనాలు, ఇతర వాహనాలకు స్టాండ్‌గా వాడుకుంటున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్‌లు గ్రామంలో నుంచి వెళ్లే విధంగా చర్యలు తీసుకొని బస్సులు బస్ స్టాండ్‌లో నిలిపే విధంగా చూడాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

యువకుడి ప్రాణాలు కాపాడిన సీఐ



యువకుడు షబ్బీర్‌ను కాపాడిన సీఐ హజరత్తయ్య

సింగరాయకొండ: రైలు పట్టాలపై ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడిని సీఐ హజరత్తయ్య కాపాడి కౌన్సెలింగ్ ఇచ్చి బంధువులకు అప్పగించారు. ఈ ఘటన సోమరాజుపల్లి రైల్వేగేటు వద్ద జరిగింది. సీఐ హజరత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం..పశ్చిమ బెంగాల్ రాష్ట్రం సిరిగిరి ప్రాంతానికి చెందిన షేక్ షబ్బీర్ 20 ఏళ్లుగా కందుకూరులోని జనార్ధన కాలనీలో తల్లిదండ్రులతో కలిసి పాల్ సీలింగ్ వృతి చేస్తూ జీవిస్తున్నాడు. 4 ఏళ్ల క్రితం షబ్బీర్ హైదరాబాద్‌కు చెందిన అమ్మాయితో ప్రేమలో పడి ఆమెతో కలిసి కందకూరులో నివసిస్తుండగా 4 నెలల క్రితం ఆ అమ్మాయి షబ్బీర్‌తో గొడవపడి వెళ్లిపోయింది. ఇది భరించలేని షబ్బీర్ ఆదివారం సుమారు 5 గంటల సమయంలో కందుకూరు నుంచి మోటారుసైకిల్‌పై సోమరాజుపల్లి రైల్వేగేటు వద్దకు వచ్చి రైలు పట్టాలపై ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సమాచారం తెలిసిన సీఐ హజరత్తయ్య వెంటనే హోంగార్డు సురేష్‌తో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్న షబ్బీర్‌ను కాపాడి తన కార్యాలయానికి తీసుకువచ్చి కౌన్సెలింగ్ ఇచ్చి బంధువులకు అప్పగించారు. సకాలంలో స్పందించి షబ్బీర్‌ను కాపాడిన సీఐ హజరత్తయను పలువురు అభినందించారు.

కాకాని గోవర్దన్ రెడ్డిని కలిసిన మండల కన్వీనర్


కాకానిని కలిసిన తిరుపతిరెడ్డి, నాయకులు

లింగసముద్రం (కందుకూరు రూరల): నెల్లూరు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాని గోవర్దన్ రెడ్డిని లింగసముద్రం మండలం పార్టీ కన్వీనర్ పిచ్చపాటి తిరుపతిరెడ్డి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. మండల పార్టీ విషయాలపై చర్చించారు. వంకాయలపాటి వెంకటేశ్వర్లు, కొమ్మి పోతులూరయ్య, నెల్లూరు జిల్లా ప్రచార కమిటీ సభ్యులు పూరిమెట్ల శ్రీను, కిలారి సురేంద్ర, జి.లక్ష్మీనారాయణ, మండల సోషల్ మీడియాకన్వీనర్ కిలారి సంతోష్ ఉన్నారు.

డిగ్రీ ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు

కందుకూరు రూరల్: స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 7, 8, 9వ తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రవికుమార్ ఆదివారం తెలిపారు. మిగిలిపోయన సీట్లకు అడ్మిషన్లు చేస్తున్నట్లు చెప్పారు. బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీలో మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, బీఏలో స్పెషల్ ఇంగ్లిష్, ఎకనామిక్స్, పొలికల్ సైన్స్ కోర్సుల్లో ఖాళీలున్నట్లు తెలిపారు. ఫీజులో రెండు వేల రూపాయలు వరకు కళాశాల రాయితీ కల్పిస్తుందన్నారు.